క్లుప్తంగా

మామిడి, టేకు చెట్లు దగ్ధం



దగ్ధమైన మామిడి చెట్లు

రామడుగు: మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పలువురు రైతులకు చెందిన మామిడి చెట్లు దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన కట్ల వేణుగోపాల్, లక్ష్మణ్‌కు చెందిన మామిడి, టేకు చెట్లు పూర్తిగా కాలిపోయాయని, చుట్టు పక్కల రైతులు మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఆర్ఎస్పీ



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, రవిశంకర్

రామడుగు: మండలంలోని వెదిర గ్రామానికి చెందిన శనిగరపు పృథ్వీ అనే యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. అనంతరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు దుద్యాల రాజిరెడ్డి ఇంటిలో భోజనం చేశారు. వెంట దేశరాజ్‌పల్లి ఎంపీటీసీ వంచ మహేందర్‌రెడ్డి, నాయకులు అనిల్‌రావు, అర్జున్, లచ్చిరెడ్డి, రాజేశం, శ్రీనివాస్‌రెడ్డి, జగన్‌రెడ్డి, రవీందర్, స్వరూప, శ్యామ్, అరవింద్ పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

సైదాపూర్: బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా కార్యకర్తలకు అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. బుధవారం సింగపూర్‌లోని పార్టీ క్యాంపు కార్యాలయంలో వెన్నంపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పిన్‌రెడ్డి రాంరెడ్డి భార్య పద్మకు రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజయ్య, బిల్లా వెంకటరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాములు ఉన్నారు.

రేపు విద్యుత్ సరఫరా బంద్



హుజూరాబాద్: మరమ్మతుల దృష్ట్యా 31న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో టౌన్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. హుజూరాబాద్ పట్టణంతో పాటు కొత్తపల్లి, బోర్నపల్లిలో ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మండల సభ వాయిదా

తిమ్మాపూర్: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ వనిత అధ్యక్షతన జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. ఎంపీపీ, అధికారుల మినహా సభ్యులు ఎవరూ సమావేశానికి రాలేదు. కాసేపు వేచి చూసిన ఎంపీపీ సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో మండల సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

కారు, ట్రాక్టర్ ఢీ



మానకొండూర్: మండలంలోని రంగపేట శివారులో మానకొండూర్–జమ్మికుంట రహదారిపై బుధవారం ట్రాక్టర్–కారు ఢీకొన్న సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. వెల్ది గ్రామం నుంచి ఓ ట్రాక్టర్ రంగపేట మీదుగా కెల్లేడు వెళ్తోంది. ఈదులగట్టెపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో మానకొండూర్ వైపు వస్తుండగా మార్గమధ్యలో ట్రాక్టర్, కారు ఢీకొన్నాయి. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న రమేష్, మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో ఆసుపత్రికి తరలించామన్నారు.

పశువుల మందకు డిమాండ్

- గొర్రెలు, మేకలను పొలాల్లో నిలువుకునేందుకు రైతుల ఆసక్తి
- పశువుల మందకు పెరుగుతున్న డిమాండ్
- అధిక దిగుబడి వస్తుందని ఆశ



ఖాసీంపేటలో పొలంలో ఎరువు చల్లుతున్న రైతు



పీచుపల్లి గ్రామంలోని ఓ పొలంలో గొర్రెల మంద

గన్నేరువరం: రైతులు వానాకాలం పనులకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న పంట భూములను సారవంతం చేసే పనిలో నిమగ్నమయ్యారు. సేంద్రియ ఎరువులను చల్లడం, దుక్కులు దున్నడం వంటి పనులపై దృష్టి సారించారు. పొలాల్లో గొర్రెలు, మేకల మందను పెట్టుకోవడం లేదా వాటి పేడను పొలాల్లోకి తరలిస్తున్నారు. పశువులు తక్కువ సంఖ్యలో ఉండటంతో పేడ లభించక డిమాండ్ పెరుగుతోంది. మండలంలో 6,661 సర్వే నంబర్లు ఉండగా 26,473.28 ఎకరాల భూమి ఉంది. వ్యవసాయ భూమి 15,860.38 ఎకరాలు, వ్యవసాయేతర భూమి 8092 ఎకరాలు. దీనికి అనుగుణంగా సేంద్రియ ఎరువులు లభించకపోవడంతో కొరత ఏర్పడుతుంది. పశువుల సంఖ్య తగ్గిపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురవుతుందని రైతులుఅంటున్నారు. ఒకప్పుడు ప్రతి రైతుకు రెండు లేదా నాలుగు ఎద్దులు, నాలుగైదు పాడి పశువులు ఉండేవి. వీటి పేడను రైతులు పొలాల్లో చల్లుకునే వారు. పొలాల్లో వేసవిలో తాత్కాలికంగా పశువుల పాకాలను ఏర్పాటు చేసే వారు. భూమిలో పోషకాలు పెరగడంతో ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ వాడకం తక్కువగా ఉండేది. తద్వారా పంట దిగుబడి అధికంగా వచ్చేది. కొన్నేళ్లుగా సాగు భూమి విస్తీర్ణం పెరిగిపోయి, బీడు భూములు తగ్గిపోయాయి, అలాగే జీతగాళ్లు ఉండటం లేదు. పదుల సంఖ్యలో ఉన్న పశువులను కాపాడుకోవడం గగనమైంది. దీంతో వాటి సంఖ్యను రైతులు తగ్గించుకుంటూ వచ్చారు. మండలంలో ప్రస్తుతం ఆరు వేల పశువులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

పశువుల ఎరువుకు డిమాండ్

పొలాల్లో సేంద్రియ ఎరువుల సాంద్రత తగ్గిపోవడంతో పంట దిగుబడి తగ్గిపోతోంది. ఈ క్రమంలో భూముల్లో సూక్ష్మపోషకాలను పెంపొందించడానికి తిరిగి రైతులు పాత పద్ధతులు అవలంబిస్తున్నారు. పొలాల్లో గొర్రెల, మేకల మందకు డిమాండ్ పెరిగిపోయింది. ఒక రాత్రికి రూ.మూడు నుంచి నాలుగు వేల వరకు తీసుకుంటున్నారు. పశువుల పేడ, వండ్రు మట్టి, పెంట కుప్పలను పొలాల్లోకి తరలించి కలియ దున్నడం వల్ల భూములకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, సేంద్రియ ఎరువుల వినియోగంతో భూమిలో పోషకాలు పెరిగి మొక్కలు బలంగా ఎదగడం వల్ల తెగుళ్ల బెడద తగ్గుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు.

భూమికి ఎంతో మేలు



పశువుల పేడను ఎరువుగా భూమిలో చల్లడం వల్ల పంట మొక్కలు బలంగా పెరుగుతాయి. గొర్రెల, మేకల మందను భూమిలో నిలపడం వల్ల భూమిలో అదనంగా మొక్కలకు కావాలిన పోషకాలు లభిస్తాయి. పురుగుల బెడద తక్కువ, పంట సాగులో అధిక దిగుబడి పొందడానికి అవకాశం ఉంటుంది.

– పీచు చంద్రారెడ్డి, రైతు, పీచుపల్లి

పేడ దొరకడం లేదు



గతంలో రైతుల వద్ద పదుల సంఖ్యలో పశువులుండేవి. రానురాను వాటి పోషణ భారం కావడంతో తగ్గించుకుంటూ వచ్చారు. దీంతో పశువుల పేడ దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో పొలాల్లో గొర్రెలు, మేకల మందను పెట్టుకోవడం జరుగుతోంది. మందతో భూములకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది.

– బుర్ర అంజయ్యగౌడ్, రైతు, గన్నేరువరం

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



రామడుగు: హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేస్తున్న స్వాములు



చొప్పదండి: సాంబయ్యపల్లిలో పెద్ద పట్నం

రామడుగు: మండలంలోని కొక్కెరకుంట గ్రామంలో బుధవారం హనుమాన్ శోభాయాత్రను హనుమాన్ స్వాములు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన రహదారులు వెంట శోభాయాత్ర చేపట్టారు.

హనుమాన్ చాలీసా దండకం బహూకరణ

శంకరపట్నం: మండలంలోని గూడాటిపల్లి ఆంజనేయస్వామి ఆలయానికి నల్లవెంకయ్యపల్లి గ్రామానికి చెందిన ప్రొద్దుటూరి అంజలి–సుధాకర్‌రెడ్డి దంపతులు బుధవారం హనుమాన్ చాలీసా దండకం బహూకరించారు. రూ.18వేలతో దండకం ముద్రించి పారాయణం చేసుకునేందుకు వీలుగా ఆలయంలో ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా దంపతులను హనుమాన్ భక్తులు అభినందించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

మండలంలోని కన్నాపూర్, ధర్మారం గ్రామాల్లో బుధవారం సీతారాముల కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈవేడుకల్లో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు మంగళహారతులతో హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తుల కోసం ఉచిత అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఘనంగా బీరన్న పట్నాలు

చొప్పదండి: మండలంలోని సాంబయ్యపల్లి, చాకుంట గ్రామాలలో బుధవారం బీరన్న పట్నాలు నిర్వహించారు. పెద్దపట్నం వేసి పూజలు చేశారు. సాంబయ్యపల్లిలో గ్రామంలోని యాదవ మహిళలు బోనాలతో ఆలయానికి తరలివెళ్లి మొక్కులు సమర్పించారు. ఎంపీటీసీ కట్టికోల తార, లక్ష్మణ్ దంపతులు బీరయ్య గుడి ఆవరణలో నాలుగు రోజులుగా తల్లిదండ్రుల స్మారకార్థం గ్రామస్తులకు తాగునీరు సరఫరా చేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.



శంకరపట్నం: పూజల్లో పాల్గొన్న భక్తులు

భయంభయంగా ప్రయాణం

- రోడ్డు పక్కన ప్రమాదకరంగా చెట్లు
- ఆయా ప్రధాన రోడ్లను కమ్మేస్తున్న సర్కారు తుమ్మలు



రోడ్డును కమ్మేస్తున్న సర్కారు తుమ్మలు



రోడ్డు పక్కన ఎండిన చెట్లు



ఎత్తుగా పెరిగిన నీలగిరి చెట్లు

గంగాధర: కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారికి ఇరుపక్కల ఉన్న చెట్లు ప్రమాదకరంగా ఉన్నాయి. కొండన్నపల్లి శివారు నుంచి గంగాధర శివారు వరకు రోడ్డుకు ఇరువైపుల ఏపుగా పెరిగిన వృక్షాలతో పాటు ఎండిన చెట్లు ఎప్పుడు పడిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. కొండన్నపల్లి బస్టాండు సమీపంలో, వరదకాలువ సమీపంలో, కురిక్యాల గ్రామశివారులో రోడ్డుకు ఇరువైపుల పెద్ద పెద్ద చెట్లు ఉన్నాయి. పలుచోట్ల చెట్లు ఎండిపోగా కురిక్యాల గ్రామం నుంచి గంగాధర వరకు రోడ్డుకు ఇరువైపుల మూడు వరుసల్లో కొన్నేళ్ల క్రితం నాటిన నీలగిరి మొక్కలు ఏపుగా పెరిగాయి. గతంలో భారీ వర్షాలు, ఈదురుగాలులకు కొన్ని చెట్లు నేలవాలగా విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఇప్పుడు కూడా ప్రమాదం పొంచిఉందని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. చెట్లపై పక్షులు వాలినా, కోతులు చేరిన కొమ్మలు విరిగి పడుతున్నాయని కొండన్నపల్లి గ్రామ శివారులో గతంలో ఓ చెట్టు కొమ్మవిరిగి ఆర్టీసి బస్సుపై పడిందని, రాత్రి పూట రోడ్డుపై విరిగి పడిన చెట్లను తప్పించబోయి వాహనదారులు చాలాసార్లు ప్రమాదాలకు గురయ్యారని కొండన్నపల్లి, కురిక్యాల గ్రామాలకు చెందిన రోడ్డు పక్కనున్న వ్యవసాయదారులు పేర్కొన్నారు. హిమ్మత్‌నగర్ నుంచి గట్టుభూత్కూర్‌కు వెళ్లే రోడ్డును సర్కారుతుమ్మలు కమ్మేస్తున్నాయి. ఎదురెదురుగా వాహనాలు వెళ్లడం కష్టంగా ఉందని, రోడ్డుకు ఇరువైపుల ఉన్న సర్కారు తుమ్మలను తొలిగించాలని కోరుతున్నారు.

ఎప్పుడు పడేది తెలియదు



ప్రధాన రహదారులకు ఇరువైపుల ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించాలి. కొండన్నపల్లి శివారు నుంచి గంగాధర మండలంలోని మధురానగర్ చౌరస్తా వరకు రోడ్డు పక్కన ఎండిన చెట్లు ఎప్పుడు పడిపోతాయో తెలియడం లేదు. ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వేముల దామోదర్, మాజీ సర్పంచ్

సంపాదిత సెలవులివ్వాలి

కరీంనగర్: అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈనెల 24 నుంచి ఇప్పటివరకు పాఠశాలలకు వెళ్తున్న ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలకు వేసవి సంపాదిత సెలవులు మంజూరు చేయాలని ఎస్టీయూ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఉకంటి విజేందర్‌రెడ్డి ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులిస్తున్నారని అన్నారు. ప్రాథమిక పాఠశాలపై వివక్ష తగదన్నారు. చిన్నచిన్న కారణాలతో సస్పెన్షన్‌కు గురైన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులందరినీ తిరిగి పునర్నియామకం చేయాలని కోరారు. అధిక ఉష్ణోగ్రతలతో బడిబాటను జూన్ 1కి బదులు 12కు వాయిదా వేయాలన్నారు. పాఠశాలలు తెరిచే లోపల స్కావెంజర్‌లను నియమించాలని కోరారు. ప్రతి పాఠశాలకు ఉచిత కరెంటివ్వాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న డాక్టర్ దర్శన సమరవీర

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలని శ్రీలంక దేశం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యూకేషన్ మహరగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దర్శన సమరవీర అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఎఫెక్టీవ్ కమ్యూనికేషన్ ఫర్ ఫ్యూచర్ లీడర్స్ అనే అంశంపై కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె. శంకర్ అధ్యక్షతన ఒకరోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఇంగ్లిష్ ప్రపంచ భాష అని సాంకేతిక విద్యను అభ్యసించే వారు ఇంగ్లిష్‌పై పూర్తి స్థాయిలో పట్టు సాధిస్తే ఉద్యోగ సాధనలో ఎటువంటి ఇబ్బందులు రావని, పోటీ ప్రపంచానికి అనుగుణంగా స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.ఈశ్వరయ్య, రిజిస్ట్రార్ రాజేశ్వర్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

హుజూరాబాద్: ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు పెండింగ్ స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పొడిశెట్టి అభిలాశ్ అన్నారు. బుధవారం పట్టణంలో మాట్లాడారు. ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ రాక విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం కళాశాలలకు ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని, హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని చాలా పాఠశాలల్లో అనేక సమస్యల నెలకొన్నాయని, సంబంధిత అధికారులు పనులు వేగవంతం చేసి స్కూళ్ల ప్రారంభం నాటికి అందుబాటులోకి తేవాలని కోరారు. అడ్మిషన్ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్న ఆయా ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు.

కుంట శిఖం భూమిపై విచారణ



విచారణ చేస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి ధర్మారం గ్రామంలో కుంట శిఖం సర్వేనంబర్ 368లోని భూమిపై కౌన్సిలర్ బొంగోని వీరన్న కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ విజయ విచారణకు ఆదేశించారు. రెవెన్యూ అధికారులు ఆర్ఐ నదీన్, సర్వేయర్ మనోజ్ బుధవారం విచారణ చేపట్టారు. ఈసందర్భంగా కుంట శిఖం భూమి గుర్తించినట్లు తహసీల్దార్ తెలిపారు. బాధితులు పహణీ, పట్టాకు సంబంధించిన వివరాలు తెలియజేశారని, కార్యాలయంలో రికార్డులను పరిశీలించాలన్నారు. ప్రస్తుతం ఎలాంటి నిర్మాణాలు, మట్టి పోయడం పనులు చేయాకూడదని ఆదేశించామని విజయ తెలిపారు. ఇదే విషయంపై అడిషనల్ కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ పరిధిలోని ధర్మారం 368 సర్వే నెంబర్‌లో విచారణకు హాజరయ్యామని కుంట శిఖం భూమి కావడం వల్ల రెవెన్యూ అధికారులకు పూర్తి వివరాలు తెలియజేయాల్సిందిగా వివరాలు కోరామని మున్సిపల్ కమిషనర్ అయాజ్ తెలిపారు. విచారణలో ఇరిగేషన్ ఏఈ నవీన్, టీపీవో శ్రీధర్‌తోపాటు అధికారులు, స్థానిక కౌన్సిలర్లు బొంగోని వీరన్న, మారెపల్లి భిక్షపతి, బాధితులు గొడుగు సారయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో అవగాహన సదస్సులు



విత్తన కొనుగోళ్లపై ఉపాధి కూలీలకు అవవగాహన కల్పిస్తున్న అధికారులు

చొప్పదండి: వ్యవసాయశాఖ అధికారులు చేపట్టిన విత్తన అవగాహన సదస్సులకు రైతులు అందుబాటులో లేక పోవడంతో ఉపాధి హామీ పనులు చేసే ప్రాంతాల్లోనే సదస్సులను కొనసాగించాల్సి వస్తోంది. రోళ్లు పగిలే రోహిణి ఎండను తాళలేక రైతులు ఇండ్లకే పరిమితమవుతున్నారు. గ్రామాల్లో ఉదయమే ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు, మహిళా రైతులను గుర్తించిన అధికారులు పని చేసే చోటనే వచ్చే వానాకాలంలో విత్తనాల కొనుగోళ్లపై జాగ్రత్తలను వివరిస్తున్నారు. ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల వరకు చేరడంతో రైతులు కూడా ఇళ్ల నుంచి బయటకు వెళ్లడానికి జంకుతున్నారు. దీంతో అధికారులు అందుబాటులో ఉన్నవారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సొంత భవనాల్లేక ఇబ్బందులు

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాల్లో స్వశక్తి మహిళలకు సొంతభవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా మహిళా సంఘాలను ఆదుకోవాలని యువజన సంఘాల జిల్లా ఉపాధ్యక్షులు చట్ల సమ్మయ్య కోరారు. బుధవారం చిగురుమామిడిలో విలేకర్లతో మాట్లాడార్లు పెద్ద గ్రామాల్లో వంద స్వశక్తి సంఘాలున్నాయని, వాటిల్లో ఎనిమిది వందల నుంచి వెయ్యి మంది , చిన్న గ్రామాల్లోనైతే మూడు వందల నుంచి ఐదు వందల మంది సభ్యులుగా ఉన్నారని తెలిపారు. నెలలో మూడుసార్లు సమావేశాలు నిర్వహించుకుంటారని, సొంత భవనం లేక అవస్థలు పడుతున్నారని, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గ్రామానికో మహిళా సంఘ భవనం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సమ్మయ్య కోరారు.

యూనిఫాంలు త్వరగా కుట్టండి



కేంద్రాలను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్‌కార్పొరేషన్: అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా నగరపాలక సంస్థలోని భాగ్యనగర్‌కాలనీలో స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో స్కూల్ యూనిఫాం కుడుతున్న కేంద్రాల్లో బుధవారం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మట్లాడుతూ.. జిల్లాలోని అన్ని మున్సిపాటీల పరిధిలో గల 121 స్కూళ్లకు సంబంధించి 10,396 యూనిఫాంలకు గాను ఇప్పటివరకు 8,610 కుట్టారన్నారు. మిగతా యూనిఫాంలను త్వరితగతిన కుట్టాలని స్వయం సహాయక సంఘ సభ్యులను ఆదేశించారు. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ జి.స్వరూపరాణి మాట్లాడుతూ.. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో యూనిఫాంలను నిర్ణీత సమయంలో సంబంధిత పాఠశాలలకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంసీ శ్రీవాణి, టీఎంసీ అనిత, సీవోలు, ఏరియా లెవల్ ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జరిమానా

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలో రోడ్లపై చెత్త పడేసిన పలువురు వ్యాపారులకు నగరపాలక సంస్థ బుధవారం జరిమానా విధించింది. టవర్ సర్కిల్, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై చెత్త పడేసిన దుకాణాలను గుర్తించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్, జవాన్లు రూ.1,200 జరిమానా విధించారు.